నిలువ నీడ కరవాయె..

- బస్టాప్‌లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- ఉన్న వాటిని ఆక్రమించుకుంటున్న చిరువ్యాపారులు



లక్ష్మీ టాకీస్ బస్టాప్ వద్ద షెల్టర్ లేక ఎండలోనే నిలబడ్డ ప్రయాణికులు



పూర్ణామార్కెట్ వద్ద..



టౌన్ కొత్తరోడ్డు వద్ద..

డాబాగార్డెన్స్: పాతనగరంలో బస్టాప్‌ల సమస్య వేధిస్తోంది. ఇక్కడ బస్టాప్‌లు నిర్మించేందుకు అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా.. వానైనా రోడ్లపైనే నిల్చొని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతలా ఎదురు చూసినా బస్సు సరైన సమయానికి వస్తుందా అంటే అదీ సందేహమే. అనుకున్న సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికుల సమస్యలు రెట్టింపవుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్న బస్టాపులను సమీప ప్రాంత చిరు వ్యాపారులు ఆక్రమించుకోవడంతో ప్రయాణికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. పాతనగరం పరిధి లేపాక్షి, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, పాతపోస్టాఫీసు, లక్ష్మీటాకీసు కూడలి, పద్మానగర్, రాణిబొమ్మ కూడలి తదితర ప్రాంతాల్లో బస్టాప్‌లు లేక ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. బస్‌లు సమయానికి రాకపోవడంతో ఎండ తీవ్రతకు తల్లడిల్లుతున్నారు. జగదాంబ నుంచి పాతపోస్టాఫీస్ వరకూ రోడ్డు విస్తరణ ఉండడంతో బస్టాప్‌లు ఏర్పాటు చేయడం లేదన్న వాదన ఈ ప్రాంతంలో బలంగా వినిపిస్తోంది. నిర్మాణాలు లేని చోట బస్టాపులు నిర్మించి ప్రజల ఇబ్బందిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం రద్దీ..

పాతనగరం నిత్యం రద్దీగా ఉంటుంది. పూర్ణామార్కెట్‌లో వివిధ హోల్‌సేల్ దుకాణాలు, బట్టల వ్యాపారాలు, టౌన్‌కొత్తరోడ్డు ప్రాంతంలో వివిధ దుకాణాలు, కురుపాం మార్కెట్‌లో బంగారు దుకాణాలు, వీటితో పాటు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, బురుజుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, ఘోషా ఆస్పత్రి వంటి ముఖ్యమైన ప్రాంతాలు ఇక్కడే ఉన్నాయి. వీటితో పాటు చాలా వరకూ పాఠశాలలు, చర్చిలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం నిత్యం విద్యార్థులు, సందర్శకులు, భక్తులు, వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. బస్సులు సరైన సమయానికి రాకపోవడంతో వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నడిచే దారేది?

- ఆక్రమణలో పూర్ణామార్కెట్
- ఇష్టారాజ్యంగా దుకాణాల ఏర్పాటు



దుకాణాల మధ్య నుంచి నడిచి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న మహిళ



దగ్గర దగ్గరగా పూర్ణామార్కెట్‌లో దుకాణాలు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో నడిచే దారిలేక వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా పూర్ణామార్కెట్‌లో చెత్త సేకరించేందుకు ఓ వాహనం మార్కెట్‌లో తిరుగుతూ ఉండాలి. అయితే వ్యాపారుల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతుండడంతో ఆ వాహనం సులువుగా తిరిగే వీలు లేకుండా పోయింది. దీంతో చెత్త పేరుకుపోతోంది. అదే విధంగా లోపలికి నడిచే దారి లేక వినియోగదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలైతే మరింత ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్‌లోకి వెళ్లాలంటే ఒకరిని ఒకరు తాకుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం గ్యాంగ్ వే (రహదారిలో) దుకాణాలు ఏర్పాటు చేయడమే అని ఆరోపిస్తున్నారు. రెండు జంగిడీలు ఉండాల్సిన చోట 15 నుంచి 20 జంగిడీలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. కేటాయించిన షాపు లోపల కాకుండా సరుకంతా నడిచే దారిలోనే ఏర్పాటు చేయడం వల్లే ఈ దుస్థితి అని మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు వాపోతున్నారు.

కానరాని జీవీఎంసీ చర్యలు..

జీవీఎంసీ అధికారులు ఆశీలు వసూళ్లపై చూపిస్తున్న శ్రద్ధ సరైన పద్ధతిలో మార్కెట్ నిర్వహించే విషయంలో చూపకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అరటిపళ్ల వీధి వద్ద మరింత ఇబ్బందికరంగా ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



పూర్ణామార్కెట్‌లో ఆక్రమణల విషయంపై దృష్టి సారిస్తాం. టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగిస్తాం. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

–కె.శివప్రసాద్, జోన్–4 కమిషనర్

క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఎరుకుమాంబ ఆలయంలో 18న శివరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఈనెల 18వ తేదీన మహా శివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి కుంకుమార్చనలు, దర్శనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వెంకటసురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీష పాల్గొంటారని అన్నారు.


21న నీలమాంబేశ్వరి పరస



యాతపేటలో వెలసిన నీలమాంబేశ్వరి

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట, యాతపేటరోడ్డులో వెలసిన నీలమాంబేశ్వరి అమ్మవారి పరస మహోత్సవం ఈ నెల 21వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా 20వ తేదీ సోమవారం ఉదయం అమ్మవారి తొలేళ్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం, అంతకు ముందు కలశాలతో భారీ ఊరేగింపు, సాయంత్రం భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 21వ తేదీ ప్రధాన పండగ రోజున ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, అమ్మవారికి అలంకరణ, భక్తులకు దర్శనాలు ఉంటాయన్నారు. సాయంత్రం యాతపేటలో పరస మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. పులివేషాలు, తప్పిటగుళ్లు, నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఎస్సీల పథకాలు అమల్లోకి తేవాలి



జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోడూరి సంజీవరావు తదితరులు

మహారాణిపేట : ఎస్సీలకు చెందిన 26 పథకాలను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడూరి సంజీవరావు కోరారు. బుధవారం బీజేపీ దళిత నాయకులు కలెక్టర్ కార్యాలయంలో జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పది లక్షల మంది ఎస్సీ యువత నిరుద్యోగ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంజీవరావు, రాకేష్, మల్లీశ్వరి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సహజ యోగంపై అవగాహన సదస్సులు



కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు, కార్యక్రమ నిర్వాహకులు

డాబాగార్డెన్స్: సహజ యోగం.. నేటి మహాయోగమని మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు తెలిపారు. ఏయూ కాన్వొకేషన్ హాల్లో ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న సహజ యోగ ధ్యానంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఏపీ కో ఆర్డినేటర్ కె. స్వామిబాబు, మహిళా కో ఆర్డినేటర్ పద్మావతి, సభ్యులు మధుసూదన్, కెప్టెన్ బాబూరావు, రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం నగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఏయూ కాన్వొకేషన్ హాల్ వేదికగా సహజ యోగ ధ్యానంపై ప్రత్యేక కార్యక్రమంతో పాటు శిక్షణ ఇస్తామన్నారు. మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. దక్షిణాది ఏడు రాష్ట్రాల నుంచి సుమారు 2 వేల మంది సహజ యోగ చేసే వారు పాల్గొంటున్నట్లు తెలిపారు. సహజ యోగ ప్రతి మనిషికి ఎంతో అవసరమని, తామంతా సుమారు 30 ఏళ్లుగా సాధన చేస్తూ సంతోషంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 ఉదయం 10 గంటలకు బీచ్‌రోడ్డు పార్క్ హోటల్ వద్ద నుంచి సభాస్థలి వరకు భక్తజన ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. 19న నిర్వహించే సహజయోగ పరిచయ కార్యక్రమంలో విశాఖ వాసులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, ధర్మసాయి, రమేష్, గజేంద్ర, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పందుల కాల్చివేత



ఫెర్రీ వీధిలో కాల్చివేతకు గురైన పందులు

జగదాంబ: పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న పందులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా కాల్చివేసినట్లు జీవీఎంసీ జోన్–4 అడిషనల్ మెడికల్ అధికారి ఎస్.కిశోర్ తెలిపారు. బుధవారం జీవీఎంసీ జోన్–4 పరిధి 39వ వార్డు ఫెర్రీవీధిలో పందుల కాల్చివేత అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో పందుల సంచారం పెరిగిందన్నారు. దీనిపై పందుల పెంపకందారులతో పలుమార్లు చర్చించి బహిరంగ ప్రదేశాల్లో తిరగరాదని హెచ్చరించామన్నారు. అయినప్పటికీ వారు స్పందించకపోవడంతో పందులను కాల్చివేసినట్లు తెలిపారు. వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 2600 వరకు పందులను తరలించి 1140 పందులను నలుగురు షూటర్లు కాల్చివేసినట్లు తెలిపారు. అంతే కాకుండా జీవీఎంసీ చేపట్టిన డ్రైవ్‌కు విఘాతం కలిగిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



ఉమామహేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న కొణతాల శ్రీనివాస్, సభ్యులు

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారిగా ప్రముఖ విద్యాసంస్థల అధినేత ఎం. ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘానికి సంబంధించి పలు విషయాలు చర్చించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కోశాధికారిగా నియమించడం సంతోషకరమని, బాధ్యతతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం పేరిట త్వరలోనే వృద్ధాశ్రమం నిర్మించే ఆలోచనలో ఉన్నామని, అందుకు సంఘం కోర్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆలేటి హేమలత, కోటా రమేష్, ఆర్వీ గోవిందరావు నాయుడు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొయ్య రామకృష్ణ, కొణతాల రాధ, అక్కునాయుడు, సత్యనారాయణాచారి, త్రినాథ్, రాందేవ్, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు

మురళీనగర్: నగరంలో పర్యావరణ పరిరక్షణకు విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకురాలు కుప్పిలి కీర్తిపటానాయక్ తెలిపారు. ఈమేరకు మొక్కలు నాటడం, వాటి పరిరక్షణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈమేరకు జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్ రాజమణి, ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.విజయకుమార్‌లను బుధవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పర్యావరణ పరిరక్షణపై వారి సలహాలు తీసుకున్నట్లు చెప్పారు. వారికి మొక్కలను బహుమతిగా అందించానన్నారు.

ఉద్యోగం సాధించడం ఒక వరం



క్యాంపస్ ఉద్యోగార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: డిప్లమో స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగం సాధించడం వరమని, దీన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బెంగళూరుకు చెందిన నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్ (ఎన్‌టీటీఎఫ్) ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈ కళాశాల నుంచి 13 మంది బాలికలు ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు కంపెనీలో పూర్తి రక్షణ ఉంటుందని వివరించారు. బాలికల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఎన్‌టీటీఎఫ్ ప్రతినిధులు నివృత్తి చేశారు. ఉద్యోగంలో చేరిన వారందరికీ రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, సేఫ్టీ, సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు శ్రీపెరంబదూర్‌లోని ఫస్ట్ సోలార్ కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అమెరికా, మలేసియా, వియత్నాం వంటి దేశాల్లోని ఫస్ట్ సోలార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మేనేజర్ సీపీ రమేష్‌బాబు, సీనియర్ ఆఫీసర్ ఎస్.గీత, మెయింటెనెన్స్ ఇంజినీర్ బి.సాహుల్ ఇబ్రహీం, హెచ్ఆర్ విభాగం ప్రతినిధులు దియానా సీక్వీరా, నిర్మలా దేవి, నివేదా, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డి.దామోదర్, టీపీవో సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ



సౌభాగ్యలక్ష్మిగా దర్శనమిస్తున్న దుర్గాలమ్మ

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రంగుల గాజులతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాండ్రేగుల రూపావతి, రమణమ్మ, దశమంతుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దీపాలంకరణ..

వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ చేపట్టనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. 19న అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించనున్నారు. 26న మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) ఉంటుందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని నేవల్ డాక్‌యార్డు కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సింహాద్రినాథుని జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ సూపరింటెండెంట్‌గా అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సేవలు, వసతి సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, రమణ, ఇతర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలు చెల్లించి.. నగరాభివృద్ధికి తోడ్పడండి



పూర్ణామార్కెట్ వద్ద యూజర్ చార్జీలు వసూలు చేస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: జీవీఎంసీకి యూజర్ చార్జీలు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని జోన్–4 ఏఎంహెచ్‌వో ఎస్.కిశోర్ అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో సెక్రటరీలతో కలిసి యూజర్ చార్జీలు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్‌లో అందరూ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కలిసి యూజర్ చార్జీలు తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. దీనిపై మురికివాడ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దుకాణ సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రుల నుండి ఎప్పటికప్పుడు యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరి ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

లేజర్ కిరణాల ప్రాధాన్యత గుర్తించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

డాబాగార్డెన్స్: లేజర్ కిరణాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఫిజిక్స్ విశ్రాంత ప్రొఫెసర్ డీవీజీఎల్ఎన్ రావు తెలిపారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో లేజర్ కిరణాల ప్రాధాన్యతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కిరణాలకు కాంతి పరిమితమైన ప్రదేశం వరకు ఉంటుందని, లేజర్ కిరణాలు సుదూర ప్రాంతాలకు కూడా సునాయాసంగా చేరుకోగలవన్నారు. లేజర్ కాంతి కేవలం వినోదం కోసమే కాదని, అంతరిక్షాన్ని సైతం అవలీలగా చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. లోహాలను కత్తిరించడానికి లేజర్ కిరణాలు ఉపయోగిస్తారన్నారు. శాస్త్ర విజ్ఞానంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని, ముఖ్యంగా స్పెక్ట్రోస్కోపీ అధ్యయనంలో లేజర్ కిరణాలను విరివిగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. వైద్యం, సైనికావసరాలు, ఇంజనీరింగ్, అంతరిక్ష విజ్ఞానం, విమానయానం వంటి అనేక రంగాల్లో ఈ కిరణాలను వినియోగిస్తున్నారని చెప్పారు. ప్రొఫెసర్ లలితారావు మాట్లాడుతూ వాతావరణం కోసం శాస్త్రవేత్తలు వేగాలు, ఎత్తులు లేజర్ కిరణాల ద్వారానే తెలుసుకుంటున్నారన్నారు. నిత్య జీవితంలో వినియోగిస్తున్న సీడీ, డీవీడీల్లో కూడా లేజర్ కిరణాల ప్రభావం ఉంటుందని చెప్పారు. ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ శాంతమ్మ మాట్లాడుతూ కాంతిని నిలువుగా, నిటారుగా అందించే శక్తి లేజర్ కిరణాలకు మాత్రమే ఉంటుందని వివరించారు. భౌతికశాస్త్ర విద్యార్థుల నుంచి అధ్యాపకుల వరకు లేజర్ కిరణాల ప్రాముఖ్యత తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్. శ్రీనివాసరావు, కళాశాల డీన్ జి. శంకరనారాయణ, కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్, పైడి రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తి.. గురుభక్తి అవసరం



విద్యార్థులకు స్టడీమెటీరియల్, విద్యా సామగ్రి అందజేస్తున్న ఫాదర్ రత్నకుమార్ తదితరులు

డాబాగార్డెన్స్: విద్యార్థులకు దైవభక్తి, దేశభక్తి, గురుభక్తితో పాటు తల్లిదండ్రుల పట్ల విధేయత ఉండాలని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మరియదాస్ అన్నారు. ఆ స్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయుడు, కరస్పాండెంట్ ఫాదర్ కె. జోజిబాబు ప్రథమ వర్ధంతి బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్లాంకులు, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. ముందుగా ఫాదర్ జోజిబాబు చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల మరణించిన ఆ స్కూల్ పూర్వ ఉపాధ్యాయుడు వెంకట్రావు మాస్టారుకు కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రత్నకుమార్, పూర్వ ప్రధానోపాధ్యాయుడు మరియదాస్ మాట్లాడుతూ ఫాదర్ జోజిబాబు 50 ఏళ్ల పైబడి గురువుగా అనేక సేవలందించారన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమతో పాటు ఎంతో మంది పూర్వ విద్యార్థులు ఫాదర్ జోజిబాబు వద్ద క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకున్నారని తెలిపారు. పాఠశాల మాజీ ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోండ్ర రామకృష్ణ, కాశీభట్ల స్వరూప్, నక్కెళ్ల త్రినాథ్, కిలాని గణేష్, దూళి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌తో వాటర్ కమిషన్ సభ్యుల భేటీ



కమిషన్ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో చేపడుతున్న తాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి తదితర వాటి పని తీరును పరిశీలించేందుకు నగరానికి వచ్చిన సెంట్రల్ వాటర్ కమిషన్ బృందం బుధవారం జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి చేసే విధానాన్ని కమిషనర్ వారికి వివరించారు. అనంతరం కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి ప్రసాద్, శాస్త్రవేత్త నీలిమా పాటి మాట్లాడుతూ నగరంలో ప్రతి ప్రాంతానికి వెళ్లి ప్లాంట్ల నిర్వహణ ఏ విధంగా అమలు చేస్తున్నారో పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు పాల్గొన్నారు.